క్లుప్తంగా

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎన్నిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి చైతన్య

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థి వై.చైతన్య దక్షిణ భారత విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. బీటెక్ ఫైనలియర్ చదువుతున్న వై.చైతన్య జేఎన్‌టీయూఏ తరఫున కబడ్డీలో ప్రతిభ చూపడంతో దక్షిణ భారత విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలు అక్టోబర్ 1 నుంచి 5 వరకు కర్ణాటక రాష్ట్రం బెల్గావిలో జరుగుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జున్‌రెడ్డి చైతన్యను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోట: కోటక్రాస్ రోడ్డు వద్ద ఆదివారం మోటార్ బైక్ బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. విద్యానగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, పవన్ మోటార్‌బైక్‌లో కోటకు వస్తుండగా కుక్కను ఢీకొని మోటార్‌బైక్ అదుపుతప్పి పడిపోయింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ముస్లిం ఐక్యవేదిక సమావేశం

కోట: ముస్లిం ఐక్యవేదిక మండల సమావేశం స్థానిక షాదీమంజిల్‌లో ఆదివారం నిర్వహించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల్లో ముస్లింలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాజకీయంగాను ముస్లింలు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లింలలో చైతన్యం నింపేలా ముస్లిం ఐక్యవేదిక పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్యవేదిక అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, జాఫర్‌వలి, సయ్యద్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రగతి విద్యార్థి ప్రతిభ



నిహాల్ మనోహర్

కోట: నెల్లూరులో ఆదివారం జరిగిన కెనీషిటోర్యో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కోటలోని శ్రీప్రగతి విద్యానికేతన్ విద్యార్థి పసుపులేటి నిహాల్ మనోహర్ కాంస్య పతకం సాధించినట్లు ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ కిషోర్ తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న నిహాల్ మనోహర్ చిన్నతనం నుంచే కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో గుర్తింపు పొందారన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

రాపూరులో గురజాడ జయంతి



గురజాడకు నివాళులర్పిస్తున్న అంజయ్య

రాపూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి అంజయ్య నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెళ్లకూరు: మండలంలోని చెంబడిపాళెం గిరిజన కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆ యువతి కొన్ని రోజులుగా కనబడడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతల కబ్జాపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దళితులు

బాలాయపల్లి(సైదాపురం): టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీతో దళితుల శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన సంఘటన ఆదివారం మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ దళితుల కథనం మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ గ్రామంలోని టీడీపీ నాయకులు తాళ్లూరు గోపి నాయుడు, వల్లభనేని సురేష్‌నాయుడు, తాళ్లూరు భాస్కర్‌నాయుడు, మరో వ్యక్తి కలిసి శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారు. వెంటనే అడ్డుకునేందుకు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు		22-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	138
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	246
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	272
లేయర్ చికెన్	:	187

ఆగని ఇసుక అక్రమ రవాణా

- ఇళ్ల ముందే డంపింగ్
- ట్రాక్టర్ల ద్వారా తరలింపు



ఇలుపూరు గ్రామంలో ఇళ్ల మందే ఇసుక డంపింగ్

సూళ్లూరుపేట రూరల్ : కూటమి నేతల అధికారం అండతో రెచ్చిపోతున్నారు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కాళంగి నదిని తవ్వి ఇసుకను తరలించి ఆ గ్రామంలో గృహాలు నిర్మాణాలు ఉన్నాయని చెప్పి ఆ ప్రాంతంలో ఉన్న ఇళ్ల ముందు ఇసుక డంపు చేసుకుని యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. టైరు బండ్లతో రాత్రి వేళల్లో నదిలోకి దిగి ఇసుకను తరలిస్తున్నారు. స్మగ్లర్లు ఆయా ఇంటి నిర్మాణం అని చూపించి ఇంటి ముందు ఇసుక వేసుకుని అక్కడ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో విస్తరించి ఉన్న కాళంగి నదిలో నాణ్యమైన ఇసుక ఉంది. దీనికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీన్ని గుర్తించిన ఇసుకాసురులు నదిని తోడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇలుపూరు గ్రామం, ఆర్టీసీ డిపో వెనుక నుంచి నది పొర్లుకట్టను తవ్వి దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇలుపూరు గ్రామంలో ఇసుకను డంప్ చేస్తున్నారు. ఇళ్ల ముందు కొన్ని చోట్ల, కాళంగి నది వద్దే డంప్ చేసుకుని నిత్యం వందలాది ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. కూటమి నేతల అండతో దర్జాగా ఇసుక ట్రాక్టర్లు హైవేపై సరిహద్దు దాటి వెళుతున్నాయి. ఆర్డీవో, తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు పోలీసులు, హైవే పట్రోలింగ్ వాహనం తిరుగుతునే ఉంటుంది. కళ్ల ముందు ట్రాక్టర్లు వెళ్తున్నా అడిగే ధైర్యం వారికి లేక పోవడం శోచనీయం.





ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్న కూలీలు, జాతీయ రహదారిపై వెళుతున్న ఇసుక ట్రాక్టర్

సావిత్రిబాయి పూలే ట్యూషన్ సెంటర్



మాట్లాడుతున్న మస్తాన్‌రావు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో తిరుపతికి చెందిన వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే ట్యూషన్ సెంటర్‌ను ఆదివారం విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెసల మస్తాన్‌రావు నూతనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి అన్ని విధాలుగా విద్యార్థులకు బోధన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించడం కోసం వివిధ రకాల క్రీడలను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి నాగార్జున, డాక్టర్ రవికుమార్, ప్రభాకర్, వెంకటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిధుల రికార్డులు స్వాధీనం



పంట్రంగం ఆలయంలో విచారణ జరుపుతున్న అధికారులు

వాకాడు: మండలంలోని పంట్రంగం గ్రామంలో శతాబ్దాల చరిత్ర కల్గిన శ్రీ పాండురంగేశ్వర, రామలింగేశ్వర ఆలయానికి సంబంధించిన నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఆదివారం దేవదాయశాఖ ఉన్నత అధికారులు విచారణ చేపట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయానికి సంబంధించి భూముల కౌలు వేలం ద్వారా వచ్చిన దాదాపు రూ.17లక్షల సొమ్మును ఓ అధికారి బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై దేవదాయశాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదు అందడంతో అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి తన బృందంతో పంట్రంగం ఆలయంలో స్వాహా జరిగిన సొమ్ముపై విచారణ జరిపి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకునిప్రధాన కార్యాలయానికి పంపనున్నట్లు సమాచారం.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండల కేంద్రంలోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వారి పర్యవేక్షణలో మేనేజింగ్ ట్రస్టు చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామ నాయుడు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 75 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. మరో 80 మందికి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏఈ కృష్ణ అరవింద నేత్రాలయ సిబ్బంది జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వీరరాఘవుల స్వామికి ప్రత్యేక పూజలు



అన్నదానానికి బారులు తీరిన భక్తులు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని చలివేంద్రం గ్రామ వద్ద వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వైద్య వీరరాఘవుల(పేరుమాళ్) స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏడాదికోసారి వచ్చే మహాలయ అమావాస్య సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేక పూజలను భక్తుల నడుమ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేపట్టి పూజలు చేవారు. ఆలయం వద్ద మధ్యాహ్నం వందలాది మంది భక్తులు, పేదలకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఆలం అమ్మణ్ణమ్మ సారధ్యంలో జరిగిన పూజ కార్యక్రమాల్లో ఉభ యదాతలు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో ఐఐహెచ్‌టీ పూర్వ విద్యార్థులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలో ఉన్న శ్రీ ప్రగడ కోటయ్య ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ (ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీ) పూర్వ విద్యార్థులు 4వ ప్రాంతీయ సమ్మేళనం చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ నుంచి పూర్వపు విద్యార్థులు సుమారు 100 మంది ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు గజం శ్రీనివాసులు మాట్లాడుతూ ఐఐహెచ్‌టీలో కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్లే విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు శాంతన కృష్ణన్, కార్యదర్శి పిడి కిషోర్, కోశాధికారి హరినాథ్‌బాబు, నక్కా దుర్గా ప్రసాద్, మార్గదర్శకం ఆంధ్రప్రదేశ్ రీజనల్ ఇన్‌చార్జి బత్తల భాస్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



నరసింహులును పరామర్శిస్తున్న యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని 4వ వార్డు సాలికాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, చేనేత కార్మికులు పాపన నరసింహులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర ఆదివారం నరసింహులు నివాసం వద్దకు చేరుకుని ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

అదనపు ధరలకు రెవెన్యూ స్టాంపులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలో అనుమతులు పొందిన స్టాంప్ వెండర్లు ఈ రెవెన్యూ స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని స్థానిక బీజేపీ నాయకులు చిగురాకులు సురేంద్ర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆదివారం తెలిపారు. పట్టణంలో చంద్ర ప్రియ లాడ్జీ సముదాయంలో ఉన్న జిరాక్స్ దుకాణంలో అధికారికంగా అనుమతులు పొందిన స్టాంప్ వెండర్ ఇష్టారాజ్యంగా ఈ- స్టాంప్ అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నట్లు ఫిర్యాదు చేశారు. కేవలం రూ.20 రూపాయల ఈ స్టాంప్ రూ.50 కు విక్రయిస్తున్నట్లు తెలిపారు.


దాడిపై పోలీసుల విచారణ

కోట: మండలంలోని చిట్టేడులో ఆదివారం భూవివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. చలపతి, నీలగిరి తమపై దాడికి పాల్పడినట్లు వెంకటేశ్వర్లు, మహేంద్ర, ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దాడి ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తీవ్రంగా గాయపడిన కార్మికుడు

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని ఎస్‌కేఎల్ఎస్ పెట్రోల్ బంక్ సమీపంలో జరుగుతున్న బ్రిడ్జి పనుల వద్ద ఆదివారం పశ్చిమ బెంగాల్ ప్రాంత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సహచరుల కథనం మేరకు సాగరమాలకు సంబంధించి రోడ్డు పనులు చేస్తున్న పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన కార్మికుడిపై ఇనుప కమ్ములు పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు విచారించి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

కోట: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం కోరారు. కోటలోని అల్లారెడ్డి శ్యాంసుందరరెడ్డి భవన్‌లో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ఎక్కువ పనిభారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రకరకాల యాప్‌లను ప్రవేశపెట్టి ఆన్‌లైన్ సేవల భారం కూడా ఉపాధ్యాయులపై మోపారని గుర్తుచేశారు. వీటిని రద్దు చేసి ఉపాధ్యాయులను విద్యాబోధనకు మాత్రమే ఉపయోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, పీఆర్‌సీ, ఇతర ఆర్థిక అంశాలపై చర్చించారు. యూటీఎఫ్ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలను ప్రతిపాదించారు. మండలాల వారీగా గ్రూప్ చర్చలు, నివేదికలు, భవిష్యత్తు ప్రణాళికలు వాటి అమలుపై సమావేశంలో నిర్ణయాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి మస్తానయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయకుడు, మువ్వల మనోహర్, నుమాయిష్, రమేష్, రాజ్‌కుమార్, ఆవుల సుబ్బయ్య పాల్గొన్నారు.

మాంబట్టులో మహాలయ అమావాస్య పూజలు



గోపూజ చేస్తున్న భక్తులు

తడ: మండలంలోని చిన్న మాంబట్టు గ్రామంలో వెలసిన శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గోపూజతోపాటు శివయ్యకు పాలాభిషేకం నిర్వహించారు. తిరుపతికి చెందిన డాక్టర్ పద్మజ మునుస్వామి ఉభయ కర్తగా వ్యవహరించి హరికథా కాలక్షేపం, అన్నదానం చేశారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాదేవి అన్నదాన మందిరం ప్రాంగణంలో దివంగతులైన తల్లిదండ్రులకు తర్పణం వదిలేందుకు ఏర్పాటు చేసిన సామూహిక కార్యక్రమానికి అవసరమైన వసతులు సమకూర్చారు.

మొదలైన సిమెంట్ రోడ్డు పనులు



సిమెంట్ రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది

కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద భారీగా గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతూ అనేక మార్లు లారీలు ఇరుక్కుపోయిన సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. వీటిపై మీడియాలో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన అధికారులు టెండర్లు పిలిచి రూ.60 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. జంక్షన్ వద్ద తారు రోడ్డు వేసిన గుంతలు పడుతున్న పరిస్థితుల్లో సిమెంట్ రోడ్డు పనులు మొదలు పెట్టారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



పెంచలకోనలో విద్యుత్ దీపాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీ ఆదిలక్ష్మీదేవికి సోమవారం నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలకు పెంచలకోనలో సర్వం సిద్ధం చేశారు. స్వామి, అమ్మవారి ఆలయాల ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణ, స్వామి, అమ్మవార్ల ఆర్చిలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో జరిగే ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సైదాపురం: మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత శ్రీ మాతా గంగాభవాని దేవస్థానంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ యాదవ్ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. సోమవారం నుంచి 1వ తేదీ వరకు అమ్మవారికి వివిధ ప్రత్యేక అలంకరణలతో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 2వ తేదీ విజయదశమి నాడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు విడుదల

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. స్వామి వారి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి సంబంధించి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నట్లు ఆలయ ఈఓ రవిక్రిష్ణ తెలిపారు. ఆలయంలో 9 రోజులుపాటుగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు దాతలు ముందుకు వచ్చారని అన్నారు.

వైభవంగా జెండా ఉత్సవం



జెండా ఉత్సవంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



ఆకట్టుకుంటున్న ఆంజనేయ స్వామి జెండా

కోట: దసరా సంబరాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆంజనేయ స్వామి జెండా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కోట, వెంకన్నపాళెం, శ్యాంసుందరపురంలో జెండా పండుగను నిర్వహించారు. భక్తులు జెండాలను ఎగురవేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. కోట శివాలయంలో ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. వెంకన్నపాళెంలో విద్యుత్ వెలుగులు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు.

జెండా ఉత్సవంలో ఎమ్మెల్సీ

చిల్లకూరు: గూడూరు పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న జెండా ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. ఆంజనేయస్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



కోట శివాలయం వద్ద ఆంజనేయ స్వామి జెండా మహోత్సవం

ప్రమాదకర రహదారులపై నిరసన

నాయుడుపేటటౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వీధుల్లో గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉన్న రహదారులను పట్టించుకోవాలని సీపీఎం, పలు ప్రజా సంఘాల నాయకులు కోరారు. వారు ఆదివారం పలు ప్రాంతాల్లో అక్కడి ప్రజలతో కలసి ప్రమాదకరంగా ఉన్న గుంతల వద్ద నిలిచి నిరసనకు దిగారు. పట్టణంలో పలు చోట్ల రోడ్ల మధ్యన డ్రైనేజీ కాలువలు, తదితర చోట్ల ప్రమాదకరంగా ఉన్న వాటిపై పత్రికల్లో వస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలోని పోగొట్టం కాలనీ, అమరాగార్డెన్, అగ్రహారపేట, పాత ట్రెజరి వీధి, రాజగోపాలపురం, బేరిపేట తదితర ప్రాంతాల్లో సీపీఎం, సీఐటీయూ పలు ప్రజా సంఘల నాయకులతో పర్యటించి అక్కడి ప్రజలతో కలిసి నిరసనలు వ్యక్తం చేశారు.

కొనేవారే లేరు



ఎండలో ధాన్యం ఆరబోస్తున్న కూలీలు

చిట్టమూరు: మండలంలోని ఎడగారులో పండించిన వరిధాన్యం కొనే వారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షం కురుస్తుండడంతో ధాన్యం చూసి వెలుతున్నారు తప్ప ఎవరూ కొనడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ధాన్యం నిల్వ చేద్దామనుకుంటే ఎడగారులో కోసిన ధాన్యం నిల్వ ఉండదని, ఎక్కువ రోజులు అలాగే ఉంటే రంగు మారిపోతుందని రైతులు వాపోతున్నారు. ఎంత రేటుకైనా తెగనమ్మేద్దామనుకుంటే అడిగే వారు లేకుండా పోయారని తాడిమేడు గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. దీంతో చేసేది లేక కూలీలను పెట్టి ఎండలో ఆరబోసుకుంటున్నారు.



ఎండకు ఆరబెట్టిన ధాన్యం

కండలేరులో 50.916 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 50.916 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటిబ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.